పండుగలా 'జగనన్న విద్యాకానుక'

- పాఠశాల ప్రారంభమైన రోజే విద్యా సామగ్రి పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో 'జగనన్న విద్యాకానుక' కిట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండుగలా నిర్వహించారు. పాఠశాల ప్రారంభమైన రోజే రూ.2,600లు విలువ చేసే పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, మూడు జతల యూనిఫామ్ క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందజేయడంతో విద్యార్థుల ఆనందానికి హద్దులేకుండా పోయింది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రాయదుర్గం: విద్యాకానుక కిట్లు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



వజ్రకరూరు: విద్యాకానుక కిట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం బడి గంట మోగిన రోజే విద్యార్థినులకు 'జగనన్న విద్యాకానుక' పథకం ద్వారా కిట్లను విప్ కాపు రామచంద్రారెడ్డి అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు జయప్రద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడారు.. విద్యావ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. బడి గంట మోగిన రోజే విద్యాకానుక కిట్లు అందజేసి డ్రాపౌట్స్ తగ్గించేలా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్నే కాదు.. ప్రపంచాన్నే ఏలే స్థితికి మన పిల్లలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ బడులన్నీ రూపుదిద్దుకున్నాయన్నారు. ఇంగ్లిష్ విద్యతో పాటు డిజిటల్ రంగం వైపు అడుగులు వేసేలా కృషి చేస్తుంటే, దాన్ని అడ్డుకునేలా పెత్తందారీ భావజ్వాలం ఎలా రగిలిందో అందిరికీ తెలిసిందేనన్నారు. టీడీపీ హయాంలో చదువులు ఎంత అధ్వానంగా ఉండేవో ఓ సారి గుర్తు చేసుకోవాలన్నారు. విద్యా సంవత్సరం ముగిసే సమయానికి కూడా కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదనే మాట విద్యార్థుల నుంచి వినిపించే దౌర్భాగ్యం ఉండేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, ఎంఈఓ నాగమణి, స్థానిక కౌన్సిలర్ షాభీరాభీ, ఇతర వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల వరం

వజ్రకరూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఛాయాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 122 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చివేశారన్నారు. సీఎం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు వినియోగించుకుని విద్యావేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్ దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సుశీలమ్మ, స్థానిక నాయకులు డీలర్ రమేష్, ఎంసీ వెంకటేష్, ఓబుళేసు, ఎంఈఓ ఎర్రిస్వామి ఎంపీడీఓ విజయలలిత, తహసీల్దార్ అనిల్‌కుమార్, హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆనందం

కళ్యాణదుర్గం: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేసినట్లు ఎంఈఓ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. పాఠశాల మొదటి రోజే అన్ని పాఠశాలల్లో కిట్లను అందజేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కుందుర్పి: మండలంలోని కుందుర్పి, కొలిమిపాలెం ఉన్నత పాఠశాలలతో పాటు కుందుర్పి ఎస్సీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, సచివాలయ మండల కన్వీనర్ రాము, సర్పంచ్ మారుతేశ్వరి, ఎంపీటీసీ గంగమ్మ, పీసీ కమిటీ చైర్మన్లు వరలక్ష్మి, లక్ష్మణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు కిష్టప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం పండుగ వాతావరణం మధ్య పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో కిట్లను పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాసుల ఆంజనేయప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరీ విద్యార్థులకు అందజేశారు.

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుకల కిట్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. ఎంఈఓ మల్లారెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కమ్మూరు ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి ఎంపీపీ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు. కొర్రకోడు హైస్కూల్‌లో సర్పంచ్ చంద్రశేఖర్‌యాదవ్, ఉదిరిపికొండ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ నాగమ్మ పిల్లలకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, నేమకల్లు, దర్గాహొన్నూరు, ఉంతకల్లు తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వర రెడ్డి, సర్పంచ్‌లు పరమేశ్వర, వన్నల్లి రామాంజినేయులు, ముక్కన్న, ఎంపీటీసీలు మనోహర్‌శెట్టి, రామకృష్ణ, చిక్కణ్ణ, నాయకులు కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని పులకుర్తిలో మంగళవారం ఉదయం 6:30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి తెలిపారు. పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

నేడు సచివాలయం ప్రారంభోత్సవం

ఉరవకొండ రూరల్: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు గ్రామ సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ వెలిగొండ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. అనంతరం 1వ గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఆలయ భూముల వేలం

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను మంగళవారం ఆమిద్యాల గ్రామానికి సంబంధించిన రైతులకు కౌలుకు ఇవ్వడానికి వేలం వేస్తామని ఈఓ కె. విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం ప్రారంభిస్తామన్నారు. బుధవారం మోపిడి గ్రామానికి సంబంధించిన రైతులకు వేలం నిర్వహిస్తామన్నారు.

సచివాలయ సిబ్బందికి నోటీసులు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామ సచివాలయ సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. సచివాలయాన్ని సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేయగా సిబ్బంది ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతో నోటీసులు జారీ చేశామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ ఆయాపై ఫిర్యాదు

కూడేరు: మండలంలోని జల్లిపల్లి అంగన్‌వాడీ కేంద్రం–1లో పనిచేస్తున్న ఆయా లక్ష్మిపై పిల్లల తల్లులు సోమవారం ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాను కలసి ఫిర్యాదు చేశారు. పిల్లలతో పనులు చేయించడం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రంగా అందజేయడం లేదని సాజిదా, మలినా, వెంకటలక్ష్మి, షకీలా తదితరులు వాపోయారు. స్పందించిన ఆయన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరికి ఫోన్ చేసి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ఆయాపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

వడ్డెర్లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి



బైక్ ర్యాలీలో నినాదాలు చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్: వడ్డెర్లు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. వడ్డెర్ల సంఘం పట్టణ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికతో పాటు నియోజకవర్గ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. వడ్డెర సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, నియోజకవర్గ అధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ వడ్డెర్లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి ఐక్యంగా ముందుకుసాగాలన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వారు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు కేశవ, నాగరాజు, గోవిందప్ప, గురుస్వామి పాల్గొన్నారు.

పార్వతీ నందీశ్వరుల విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో నందీశ్వరుడు

శెట్టూరు: మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వర ఆలయంలో పార్వతీ నందీశ్వరుల విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమం, హోమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యువరాజ, ఆలయ కమిటీ సభ్యుడు బొమ్మజ్జి రమేష్, అర్చకుడు రాధాకృష్ణశర్మ, నాయకులు సోమనాథరెడ్డి, హరినాథరెడ్డి, రామకృష్ణ, వైటీ తెప్పమయ్య, పడమటి ఈరన్న, శ్యామ్, వీరభద్రప్ప, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన నరసింహప్ప

బ్రహ్మసముద్రం: మండలంలోని గుడిపల్లి గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల నరసింహప్ప(72) ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పరుశురాముడు వివరాల మేరకు.. నరసింహప్ప మద్యానికి బానిసయ్యాడు. తాగడానికి డబ్బులు లేక ఇంటి సమీపంలో ఉన్న మునగ చెట్టుకు ఉరేసుకుని ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దొడగట్టలో చోరీ

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గొల్లలదొడ్డి కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన గొల్ల అనుసూయమ్మ (దివ్యాంగురాలు) తన తల్లి నరసమ్మకు శస్త్ర చికిత్స చేసుకుని మంచానికి పరిమితం కావడంతో,, తల్లిని చూసేందుకు ఐదుకల్లుకు వెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని విషయాన్ని గమనించిన దుండగలు రాత్రి సమయంలో ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన రూ.20 వేల నగదు, జత బంగారు కమ్మలు, రివర్స్ చైనులను ఎత్తుకెళ్లారు. అలాగే కిరాణా సరుకులను సైతం ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ఈ- ఆటోల మంజూరు



ఈ-ఆటోను చూపుతున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గం: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రాయదుర్గం మున్సిపాలిటీకి రూ.38 లక్షలు విలువ చేసే తొమ్మిది ఈ-ఆటోలు మంజూరైనట్టు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించడంతో సోమవారం పట్టణానికి తొమ్మిది ఆటోలు చేరుకున్నాయన్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు ఈ-ఆటోలను ఉపయోగిస్తామన్నారు. వాటిని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చేతులమీదుగా ప్రారంభించాక వార్డుల్లోకి పంపుతామన్నారు.

'చంద్రబాబువి చిత్తశుద్ధి లేని హామీలు'



రాయదుర్గం: జాజరకల్లులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



వజ్రకరూరు: ఛాయాపురంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హామీలు చిత్తశుద్ధి లేనివని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. అధికారం కోసం 2014 లోనూ ఇలాగే అమలుకు సాధ్యం కాని 610 హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేశాడన్నారు. డి హీరేహాళ్ మండలంలోని హిర్దేహాళ్, జాజరకల్లు గ్రామాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. గత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వం, ఈ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని ప్రజలే గుర్తించాలన్నారు. కులమతాలు, పార్టీలు, ఆఖరుకు టీడీపీ కి ఓటువేశానని చెప్పుకునే పచ్చ నాయకుల ఇళ్లకు సైతం సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేర్చే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కావాలా..? ప్రతి పథకానికి ధరకట్టి కాళ్లరిగేలా తిప్పుకునే జన్మభూమి కమిటీల వద్ద మోకరిల్లే బానిస బతుకులు మళ్లీ కావాలా..? ఆలోచించాలన్నారు. అధికారం కోసం పప్పునాయుడు, తుప్పునాయకుడు, రాయదుర్గంలో మురికి కాలువ ఎంతకైనా దిగజారిపోతారన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయారన్న భ్రమలో ఉన్నారన్నారు. పేదలు, పెత్తందార్ల మధ్య జరిగే ఈ అంతిమపోరులో చివరకు జగనే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సచివాలయాల మండల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున, పరమేశ్వర, కాదలూరు హనుమంతరెడ్డి, బొమ్మన్న, ఎంపీటీసీ గంగమ్మ, నాయకులు సందీప్‌పాటిల్, కల్యం నాగరాజు, కల్యం సురేష్, జగదీష్, తొండె వెంకటేశులు, వన్నూరప్ప, ఎంపీటీసీ ఎర్రిస్వామి, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఛాయాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శమన్నారు. సంతరం ప్రజలు పలు సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, వైస్ చైర్మన్ చిదంబరి, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, స్థానిక నాయకులు డీలర్ రమేష్, డి.నరసింహులు, రాజేంద్ర, రమేష్‌నాయుడు,ఓబుళేసు, రామక్రిష్ణ, లక్ష్మిస్వామి,సురేష్, ఓబుళపతి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగ వైకల్య నివారణపై అవగాహన

కూడేరు: మండలంలోని కుష్టు రోగుల కాలనీలో సోమవారం వైద్యాధికారులు 'అంగ వైకల్య నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌బాబు, నోడల్ అధికారి రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్‌ఎం భాను, ఆశా వర్కర్లు రామాంజనమ్మ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

దొడగట్టలో చోరీ

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గొల్లలదొడ్డి కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన గొల్ల అనుసూయమ్మ (దివ్యాంగురాలు) తన తల్లి నరసమ్మను చూసేందుకు ఐదుకల్లుకు వెళ్లింది. దుండగలు రాత్రి సమయంలో ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన రూ.20 వేల నగదు, జత బంగారు కమ్మలు, రివర్స్ చైనులను ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని కంబదూరు బైపాస్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కంబదూరు మండలం ఐపార్శపల్లికి చెందిన సిద్ధార్థ్, అశోక్ పని నిమిత్తం అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా కారు ఢీ కొంది. ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: జిల్లాకు రావాల్సిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ సూచించారు. జీపు జాతాలో భాగంగా సోమవారం కళ్యాణదుర్గం టీ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. అన్నదాతలకు కీలకమైన నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. రైతు గర్జన పేరుతో సీపీఐ తలపెట్టిన జాతా జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తుందన్నారు. జిల్లాలో పెద్ద దిక్కుగా ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, తుంగభద్ర కెనాల్ ఆధునీకీకరణ పనులను వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

15న మహాధర్నాకు తరలిరండి

విడపనకల్లు: ఉరవకొండ తహసీల్దారు కార్యాలయం ఎదుట ఈ నెల 15న గాంధీ హరిజన హాస్టల్ ఫోర్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన హరిజనుల మహా ధర్నాకు తరలిరావాలని కమిటీ సభ్యులు కెంగూరి ఎర్రిస్వామి, సింగాడి వీరప్ప, మీనుగ గోపాల్, చంద్రశేఖర్, కోనాపురం ఎర్రిస్వామి, శంకరయ్య, నాగేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గడేకల్లు, వి.కొత్తకోట, మాళాపురం,పెద్ద కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో సమావేశం నిర్వహించారు.

'స్పందన'కు అధికారుల గైర్హాజరు

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కొన్ని శాఖల అధికారులే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులంతా గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ, ఏపీఎం రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు చేపట్టామని తహసీల్దార్ హుస్సేన్ పీరా తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. గైర్హాజరయిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు.

ఎంఎంహళ్లి రోడ్డు వంకకు కల్వర్టు

కూడేరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏళ్ల తరబడి ఎంఎంహళ్లి రోడ్డుకున్న వంక దాటుకునే సమస్యకు పరిష్కారం లభిస్తోందని ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. ఎంఎంహళ్లి గ్రామం ముందర వంక ఉందని, ఆ వంకలోకి పెన్నానది నీరు ప్రవహిస్తుందని ఎంపీపీ తెలిపారు. నీరు ప్రవహించేటపుడు వంకదాటుకుని గ్రామంలోకి వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బందులు పడేవారన్నారు. అందుకే ఎంపీపీ గ్రాంట్ రూ.2 లక్షలతో తాత్కాలికంగా సిమెంట్ పైపులతో కల్వర్టు పనులు ప్రారంభించామని, కల్వర్టు పూర్తయితే గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులుండవన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం

కళ్యాణదుర్గం: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని ఎస్‌ఐ ఆశాబేగం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ బాల కార్మిక నిర్మూలన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చిన్నారులను పనులలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలి

కంబదూరు: బడి–ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని సీడీపీఓ వనజ అక్కమ్మ సూచించారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఐసీడీఎస్ సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి లక్ష్మి, పద్మజ, సుశీలమ్మ, కోఆర్డినేటర్ ముత్యాలరెడ్డి, జీఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ఊరేగింపు



దేవమ్మ, కొల్లాపురమ్మ దేవతలను ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లులో సోమవారం గ్రామదేవతలు దేవమ్మ, కొల్లాపురమ్మను వైభవంగా ఊరేగించారు. ఉదయం ఉత్సహమూర్తులను మేళతాళాలతో వేదావతి హగిరికి తీసుకెళ్లి గంగపూజ నిర్వహించారు. సాయంకాలం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సహ మూర్తులను ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు. రాత్రి 9 గంటల వరకు సాగిన ఊరేగింపులో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఇది ఇలా ఉండగా మంగళవారం దేవమ్మ ఆలయంలో బోనాల ఉత్సవం నిర్వహించనున్నారు. అర్ధరాత్రి అమ్మవారిపోతును ఆలయం వద్ద బలివ్వనున్నారు. వేడుకలకు బయట ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వీధులు, ప్రధాన రహదారులు కిటకిటలాడాయి.

పరిశ్రమలతో ఆర్థికాభివృద్ధికి బాటలు



చిక్కీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని మోరేపల్లిలో సోమవారం పీఎంఎఫ్ఎంఈ పథకం కింద వేరుశనగ చిక్కీ తయారీ పరిశ్రమను రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.రఘునాథ్‌రెడ్డితో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు బందరు రామాంజినమ్మతో పరిశ్రమ స్థాపనపై మంత్రి చర్చించారు. ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను విస్తృత పరచాలన్నారు. రూ.10 లక్షల వ్యయంతో యూనిట్‌ను నెలకొల్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓలు గౌసియా, పీటర్ సైమాన్, డీఆర్‌పీ హరీష్‌బాబు, స్థానిక నాయకులు రామాంజనేయులు, గంగప్ప, గోపాల్‌రెడ్డి, శీనప్ప, చంద్ర, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రెండు దశాబ్దాలుగా అనేక బాధలతో నలిగిపోయాం.. చాలీచాలని జీతాలు, అభద్రతతో అనుక్షణం నరకయాతన అనుభవించాం. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై వారి ఆనందాన్ని 'పాలు'పంచుకున్నారు. విప్ మాట్లాడుతూ ప్రజలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. అడకుండానే 12వ పీఆర్సీ ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించి 10 వేల కుటుంబాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. 2008లో వైఎస్సార్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తే.. 2014 లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాటిచ్చి మోసం చేశాడన్నారు. 2019 లో అధికారంలోకి వచ్చే ముందు సీఎం జగన్ మాటిచ్చి అమల్లోకి తీసుకొచ్చారన్నారు. అనంతరం ఉద్యోగులు విప్ కాపు ను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూమినే నమ్ముకున్నాం.. న్యాయం చేయండి

కళ్యాణదుర్గం: 50 ఏళ్లుగా తండ్రి వారసత్వంగా వచ్చిన భూమిని ముగ్గురు అన్నదమ్ములం సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు తెలియకుండా పెదనాన్న కుమారులు ఆ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు... న్యాయం చేయాలని ఓ కుటుంబం కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆర్డీఓ నిషాంత్ రెడ్డి వద్ద మొర పెట్టుకుంది. శెట్టూరు మండలం బచ్చేహళ్లికి చెందిన ఈడిగ వన్నూరప్ప కుమారులు ఈడిగ మల్లికార్జున, ఈడిగ చెన్నమల్లప్ప, ఈడిగ వెంకటేశులు సర్వే నంబర్ 211–3 లో 3.52 ఎకరాలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి తెలియకుండా 2023, మార్చి 13న పెదనాన్న ఈడిగ వెంకటేశులు కుమారుడైన ఈడిగ వన్నూరుస్వామి ఆన్‌లైన్‌లో ఆ భూమిని ఎక్కించుకున్నారని ఆర్డీఓ వద్ద ఫిర్యాదు చేశాడు. క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని శెట్టూరు రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. అదేవిధంగా పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. స్పందనలో వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.